సాక్షి
జగిత్యాల

ఆదివారం । 9 । జూలై । 2023




సప్తగిరికాలనీ(కరీంనగర్): ఉమ్మడి కరీంనగర్ జిల్లా (ప్రస్తుతం సిద్దిపేట) అంతకపేట హైస్కూల్ 1985–86 బ్యాచ్ విద్యార్థులు 65 మంది రూ.8 లక్షలకు పైగా జమ చేశారు. పాఠశాలకు సుమారు రూ.లక్షన్నరతో వేదిక నిర్మించారు. రోటరీ క్లబ్ సహాయంతో రూ.1.60 లక్షలతో విద్యార్థులకు 30 సైకిళ్లు, కుట్టు మెషిన్లు అందించాలని నిర్ణయించారు. ఏటా పదోతరగతిలో 10 జీపీఏ, ట్రిపుల్ఐటీలో సీటు సాధిస్తున్న విద్యార్థులకు రూ.10 వేల చొప్పున నగదు ప్రోత్సాహకం అందిస్తున్నారు. తోటి మిత్రులు నలుగురు చనిపోగా వారి కుటుంబాలకు రూ.50 వేల చొప్పున ఆర్థికసాయం అందించినట్లు కరీంనగర్ సెక్టోరియల్ అధికారి కర్ర అశోక్ రెడ్డి, వ్యాపారి జనగామ పాపారావు తెలిపారు.

సండే స్పెషల్

- పూర్వ విద్యార్థుల వాట్సాప్ గ్రూపుల ఏర్పాటు
- ఆత్మీయ సమ్మేళనాలే వేదికగా ఒక్కచోట చేరిక
- చదువుకున్న పాఠశాలలు, విద్యార్థులకు సామగ్రి వితరణ
- పేదలకు అండగా సేవా కార్యక్రమాలు
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఆదర్శంగా నిలుస్తున్న పలువురు చిన్నప్పటి దోస్తులు

# స్నేహం.. సేవతో పదిలం

వారంతా చిన్నప్పటి దోస్తులు.. పాఠశాల విద్య పూర్తయ్యాక ఉద్యోగం, వ్యాపారం, వృత్తుల్లో స్థిరపడ్డారు.. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాల పేరిట చాలా ఏళ్లకు ఒక్కచోట చేరారు.. బాల్యమిత్రులను చూసి, భావోద్వేగానికి గురయ్యారు. క్షేమ సమాచారం తెలుసుకొని, తరగతి గదిలో చేసిన అల్లరి, చిలిపి చేష్టలను గుర్తు చేసుకున్నారు. వారి ఆనందానికి అవధుల్లేవు. చాలాచోట్ల ఇలాంటి కార్యక్రమాల్లో కలుస్తున్నవారు తాము చదువుకున్న పాఠశాలకు, ఊరికి, పేదరికంలో ఉన్నవారికి సాయం చేయాలనుకున్నారు.. స్కూళ్లకు, విద్యార్థులకు సామగ్రి అందిస్తూ, ఊళ్లలో పలు నిర్మాణాలు చేపడుతూ, పేదలకు అండగా నిలుస్తూ.. వారి స్నేహాన్ని కలకాలం పదిలం చేసుకుంటున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అలాంటి స్నేహితులపై 'సాక్షి' ఈ వారం సండే స్పెషల్ స్టోరీ.



### తడగొండ స్నేహితుల ఔదార్యం

బోయినపల్లి(చొప్పదండి): స్థానిక హైస్కూల్ పూర్వ విద్యార్థులు, తడగొండకు చెందిన యువకులు కష్టాల్లో ఉన్న తమ స్నేహితులతోపాటు చుట్టుపక్కలవారికి సాయం చేస్తున్నారు. అనారోగ్యానికి గురైన తమ మిత్రుడు మధుకు దాతల నుంచి సేకరించి, రూ.72,500 అందించారు. తడగొండకే చెందిన పవన్‌కు స్నేహితులే వైద్యం చేయించారు. అయినా అతను బతకలేదు. అంత్యక్రియలు చేసి, బాధిత కుటుంబానికి రూ.70 వేల ఆర్థికసాయం అందజేశారు. ఇలా వారి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.



### మిత్రుడి కుటుంబానికి అండ

ముస్తాబాద్(సిరిసిల్ల): స్థానిక హైస్కూల్ 1986–87 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు.. పేదరికంలో ఉన్న తమ స్నేహితులకు అండగా నిలుస్తున్నారు. శాదుపల్లి శ్రీనివాస్‌గౌడ్, ఆయన తండ్రి లక్ష్మీనారాయణ గుండెపోటుతో చనిపోయారు. శ్రీనివాస్‌గౌడ్ కుమారుడు దివ్యాంగుడు. భార్య బీడీలు చుడుతుండగా కూతురు డిగ్రీ మధ్యలోనే మానేసింది. వీరి దీనస్థితికి చలించిపోయిన పూర్వ విద్యార్థులు శనివారం రూ.62 వేల ఆర్థికసాయం అందించారు. తమ స్నేహితుడి కుటుంబానికి అండగా నిలుస్తామని దేవేందర్, హరికృష్ణ, యాదగిరిగౌడ్, శంకర్, శ్రీనివాస్, నారాయణ తెలిపారు.



### బడికి బెంచీలు, వాటర్ ప్లాంట్

కోనరావుపేట(వేములవాడ): వట్టిమల్ల ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు చెప్యాల రాజు, ఎండీ.షాదుల్లా, పాలకుర్తి మహేశ్, లకావత్ రాంరెడ్డి, లక్కె సుదర్శన్, గండి నరేశ్, 2014–15 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు కలిసి తాము చదివిన బడికి డెస్క్ బెంచీలు అందజేశారు. ఇతరుల సహాయంతో విద్యార్థుల కోసం ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు.



### నా నేస్తం చారిటబుల్ ట్రస్టు

ఎలిగేడు(పెద్దపల్లి): మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ 1987–88 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు 2013లో నా నేస్తం చారిటబుల్ ట్రస్టును స్థాపించారు. రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి కస్తూరిబా విద్యాలయానికి స్పోర్ట్స్ డ్రెస్‌లు అందించారు. ఎలిగేడు, ధూళికట్ట ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి ఫలితాల్లో మొదటి, రెండో స్థానాలు సాధించిన విద్యార్థులకు రూ.10 వేలు ఇస్తున్నారు. ఎలిగేడు మండల నిరుద్యోగ యువతకు ఉచిత డ్రైవింగ్ శిక్షణ, లైసెన్స్ ఇప్పించారు. పేద విద్యార్థులకు ఆర్థికసాయం అందిస్తున్నారు. ఎలిగేడులో బాడీ ఫ్రీజర్, వైకుంఠ రథం ప్రారంభించారు. సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని ట్రస్టు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెంట శ్రీనివాస్, వెంగళదాసు అశోక్ తెలిపారు.



### ఆర్థిక సాయం.. అన్నదానం

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీలోని హైస్కూల్ 1986–87 బ్యాచ్ విద్యార్థులు రాజేశం, శ్యాం, శ్రీనివాస్, రవీందర్, కానుగంటి శ్రీనివాస్, కొట్టె శ్రీనివాస్ తదితరులు తమ మిత్రుడు బొంకూరి మధు కుమారుడు అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరగా రూ.50 వేలు అందించారు. రామస్వామి అనే మరో స్నేహితుడికి కష్టకాలంలో నిత్యావసర సరుకులు అందజేశారు. కరోనా సమయంలో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లోని సుమారు 300 మంది పారిశుధ్య కార్మికులకు ఐదు కిలోల చొప్పున పండ్లు పంపిణీ చేశారు. వలస కార్మికులకు అన్నదానం చేశారు.



### బాల్య స్నేహితులకు చేయూత

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): స్థానిక జెడ్పీ హైస్కూల్ 1996–97 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు చేయూత మిత్ర ఫౌండేషన్ ద్వారా ఆపదలో ఉన్న తమ స్నేహితులకు రూ.5 లక్షల వరకు సాయం అందించారు. 1994–95 బ్యాచ్‌కు చెందినవారు బాల్యమిత్ర ఫౌండేషన్ ద్వారా తమ మిత్రుడు రేసు మోహన్‌కు ఉపాధి కోసం ఆటోను కొనుగోలు చేశారు. గొరిటెల కృష్ణ గుండెపోటుతో మరణించగా వారి పిల్లల పేరిట రూ.1,20,000 బ్యాంకులో డిపాజిట్ చేశామని సంస్థ అధ్యక్షుడు సందుపట్ల లక్ష్మారెడ్డి తెలిపారు. పూర్వ విద్యార్థులు, ప్రస్తుత ఎన్నారైలు సతీశ్, రుక్మయ్య, రమేశ్, ప్రదీప్, అశోక్ పాఠశాల అభివృద్ధికి దాదాపు రూ.6 లక్షలు ఖర్చు చేశారు.



### విద్యార్థి దత్తత కార్యక్రమం

ధర్మపురి: ధర్మపురికి చెందిన గొల్లపల్లి గణేశ్ దివ్యాంగుడు. స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాల (గతంలో యూపీఎస్)లో చదివి, అదే స్కూల్లో తెలుగు పండిట్‌గా పని చేస్తున్నారు. నిరుపేద విద్యార్థులు చదువుల్లో రాణించడానికి విద్యార్థి దత్తత అనే కార్యక్రమం ద్వారా చేయూతనిస్తున్నారు. దీనికి ధర్మపురికి చెందిన ఆయన మిత్ర బృందంతోపాటు ఎన్నారైలు సాయం చేస్తున్నారు. ఇప్పటివరకు 2,500 మంది నిరుపేద విద్యార్థులకు సుమారు రూ.15 లక్షల విలువైన విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఏడుగురు విద్యార్థినుల ఉన్నత విద్యాభ్యాసానికి సుమారు రూ.16 లక్షలు చెల్లించారు.



### సమస్యలపై ఆరా.. తక్షణ స్పందన

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ హైస్కూల్ పూర్వ విద్యార్థి, బీర్‌పూర్‌కే చెందిన చిట్నేని విజయ్‌కుమార్ పాఠశాల పూర్వ విద్యార్థులు 150 మందితో వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేశాడు. అందరూ ఎక్కడ ఏ సమస్య ఉందని ఆరా తీస్తూ తక్షణమే సాయం చేస్తున్నారు. బీర్‌పూర్‌కు డెడ్‌బాడీ ఫ్రీజర్ అందించారు. బడిలో వాటర్ ట్యాంక్ నిర్మించారు. నలుగురు పేద విద్యార్థులకు రూ.50 వేల చొప్పున అందజేశారు. కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నామని విజయ్‌కుమార్, వేణు తెలిపారు.



### స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

కోరుట్ల రూరల్: పెద్దాపూర్ గురుకుల పూర్వ విద్యార్థి, వ్యాపారి చెన్నమనేని శ్రీనివాసరావు తాను చదువుకున్న విద్యాలయంలో విద్యార్థుల కోసం రూ.10 లక్షలతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మించారు. పాఠశాల అభివృద్ధి కోసం 1989–90 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులతో ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసి, సొంత ఖర్చులతో సిల్వర్ జూబ్లీ నిర్వహించారు. పూర్వ విద్యార్థులు గురుకులంలో వాటర్ ప్లాంట్ నిర్మించారు. విద్యార్థుల కోసం డెస్క్ బెంచీలు అందజేశారు.

### రూ.20 లక్షలతో తరగతి గదులు



కోనరావుపేట(వేములవాడ): నిజామాబాద్ ప్రాథమిక పాఠశాలలో చదువుకున్న విద్యార్థులందరూ కలిసి పూర్వ విద్యార్థుల సంఘం ఏర్పాటు చేసుకున్నారు. దీనికి రిటైర్డ్ డీఎస్పీ గోగూరి మోహన్‌రెడ్డి అధ్యక్షుడిగా ఉన్నారు. పాఠశాలలో తరగతి గదుల కొరత ఉందని తెలుసుకొని, రూ.20 లక్షలతో రెండు గదులు నిర్మించారు. వాటిని 2022 డిసెంబర్ 2న అప్పటి సర్పంచ్ కేతిరెడ్డి అరుణ, డీఈవో రాధాకిషన్ చేతులమీదుగా ప్రారంభించారు.

## న్యూస్‌రీల్

### చట్టాలపై అవగాహనతోనే వృత్తిలో రాణింపు



మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ అరుణ్‌కుమార్

మెట్‌పల్లి: చట్టాలపై అవగాహనతో వృత్తిలో రాణించడానికి అవకాశముంటుందని మెజిస్ట్రేట్ అరుణ్‌కుమార్ అన్నారు. ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం జూనియర్ న్యాయవాదులకు ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణా శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఐఎల్‌పీఏ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా జూనియర్ న్యాయవాదులకు శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. వీటిని సద్వినియోగం చేసుకొని పలువురు మెజిస్ట్రేట్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా ఎంపికయ్యారని తెలి పారు. ఈ కార్యక్రమంలో పీపీ మాధవి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పుప్పాల లింబాద్రి, బద్దినర్సయ్య, ఐఎల్‌పీఏ అధ్యక్షులు పొన్నం దేవరాజ్, రాజేశ్వర్‌రావు, రాములు, లత, శ్రీనివాస్, తెడ్డు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

### ఉత్తమ ఉపాధ్యాయుడిగా రాజేందర్

ఇబ్రహీంపట్నం: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఏటా నిర్వహించే జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తికి చెందిన ఆకు రాజేందర్ ఎంపికయ్యారు. కథలాపూర్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో టీజీటీ తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న రాజేందర్‌ను శుక్రవారం జగిత్యాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, అడిషనల్ కలెక్టర్ మంద మకరందులు సన్మానించి ప్రశంసాపత్రం అందజేశారు. వేములకుర్తిలోని స్నేహితులు, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

## వైఎస్సార్ పాలన స్వర్ణయుగం లాంటిది



వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

- అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు రూ.4 వేలు భృతి
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్/జగిత్యాలటౌన్: వైఎస్సార్ పాలన ప్రజలకు స్వర్ణయుగం లాంటిదని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. శనివారం జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలో వైఎస్సార్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్ రైతు పక్షపాతి అని, ఇచ్చిన హామీ ప్రకారం అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసంతకం ఉచిత కరెంట్‌పై చేశారని గుర్తు చేశారు. 108 అంబులెన్స్ పథకం ఎంతో మంది ప్రాణాలు కాపాడిందని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, రాజీవ్ ఆరోగ్యశ్రీతో కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం అందించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఇప్పటికీ ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు రూ.4,000 భృతితో పాటు, వితంతు, వృద్ధులకు, గీత కార్మికులకు చేనేత వృత్తి వారికి రూ.4 వేల పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చారు. డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పీసీసీ సభ్యుడు గిరి నాగభూషణం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య, పార్టీ జగిత్యాల రూరల్ మండల అధ్యక్షుడు జున్ను రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి



మాట్లాడుతున్న సురేశ్

ధర్మపురి: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవత్ సురేశ్ డిమాండ్ చేశారు. శనివారం ధర్మపురిలో నిర్వహించిన తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మండల స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అర్ధాంతరంగా ఆగిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయొద్దని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 57 మెమో ద్వారా 2002, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తించేలా కృషి చేయాలని కోరారు. పాఠశాలల్లో స్కావెంజర్లను నియమిస్తే పరిశుభ్ర వాతావరణం ఏర్పడుతుందన్నారు. ఈకార్యక్రమంలో తపస్ రాష్ట్ర బాధ్యులు నరేందర్‌రావు, వెంకటరమణ, రొట్టె శ్రీనివాస్, బోనగిరి దేవయ్య, కాశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ భాస్కర్

రాయికల్: జిల్లాలోని బీర్‌పూర్, బుగ్గారం మండలాలతోపాటు నూతన మండలాలైన బండలింగాపూర్, ఎండపల్లి, భీమారంలో పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు ఎస్పీ ఎగ్గడి భాస్కర్ తెలిపారు. శనివారం రాయికల్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఠాణాల అభివృద్ధి కోసం రూరల్ పోలీస్‌స్టేషన్లకు రూ.25వేలు, అర్బన్‌కు రూ.50వేలు మంజూరయ్యాయని అన్నారు. గంజాయి నియంత్రణకు పోలీసుశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతుందని, దీని కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఇసుక అక్రమ రవాణాపై రెవెన్యూ, మైనింగ్ అధికారులతో ప్రత్యేక నిఘా పెడుతున్నామన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రకాశ్, రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్, ఎస్సై అజయ్ పాల్గొన్నారు.

### నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

జగిత్యాలక్రైం: నేరాల నియంత్రణతో పాటు నేరస్తులను గుర్తించడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. శనివారం జగిత్యాల కొత్త బస్టాండ్, ప్రభుత్వ ఆస్పత్రిలో సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. ప్రస్తుత రోజుల్లో ఎలాంటి నేరాలు జరిగినా నేరస్తులను పట్టుకోవడంలో సీసీ కెమెరాలు పోలీసులకు ఒక ఆయుధంగా నిలుస్తోందన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ ప్రకాశ్, టౌన్ సీఐ నటేశ్ ఉన్నారు.

## కార్మికుల సంక్షేమం కోసమే ఉచిత శిక్షణ కేంద్రాలు



మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

- సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి: భవన నిర్మాణ కార్మికులు ఆర్థికంగా ఎదగడం కోసమే ఉచిత శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మపురిలోని ఎస్ఎల్ఎన్ఎస్‌ఏ సంస్కృతాంధ్ర కళాశాలలో నేషనల్ అకా డమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ శాఖ సౌజన్యంతో ఏర్పాటు చే స్తున్న శిక్షణా కేంద్రాన్ని శనివారం ప్రారంభించి మాట్లాడారు. వివిధ రంగాల్లో శిక్షణ తీసుకునే వారికి లేబర్ కార్డు తప్పక అవసరమని, కార్డు ఉన్న వారికి మాత్రమే ఈ శిక్షణ తరగతులకు అ ర్హులు అని అన్నారు. ఉచిత కుట్టుమిషన్ శిక్షణలో మహిళలకు 90రోజులు, భవన నిర్మాణ రంగ వృత్తుల నైపుణ్య అభివృద్ధి కొరకు 15రోజులు శిక్షణలుంటాయని తెలిపారు. శిక్షణ తీసుకునే వారు గైర్హాజరు కాకుండా చూసుకోవాలని, అందుకు బయోమెట్రిక్ విధానం ఏర్పాటు చేశారని అన్నారు. మైనార్టీ న్యాక్ ద్వారా వివిధ రంగాల్లో శిక్షణ తీసుకున్న సుమారు 300 మంది ఆర్థికంగా ఆదాయం పొందుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఎంపీపీ, జెడ్పీటీసీలు చిట్టిబాబు, బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, మున్సిపల్ వైస్ చైర్మన్ రామన్న, న్యాక్ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

సీఎం రిలీఫ్ ఫండ్ కింద లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను శనివారం ధర్మపురిలోని మంత్రి కొప్పుల ఈశ్వర్ పంపి ణీ చేశారు. వివిధ మండలాలకు చెందిన 139 మందికి రూ.47.45 లక్షల విలువైన చెక్కులు అందజేశారు.

## రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం



నియామకపత్రం అందజేస్తున్న లక్ష్మణ్‌కుమార్

బుగ్గారం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి తెలంగాణాలో అధికారంలోకి రావడం ఖాయమని జగిత్యాల డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శనివారం బుగ్గారంలో పార్టీ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అనేక మంది వివిధ పార్టీ ముఖ్య నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టం చేసేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు చేపట్టిన గొప్ప కార్యక్రమాలను ప్రచారం చేయాలన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బుగ్గారం మండల బీసీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన గాలిపెల్లి వెంకన్నకు నియామకపత్రం అందజేశారు. ఈ సమావేశంలో నాయకులు సంగనభట్ల దినేష్, గడ్డం వెంకటేష్‌గౌడ్, ఇశాంత్‌రెడ్డి, మల్లేషం తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### సెర్ప్ ఏపీఎం రజిత సరెండర్

సారంగాపూర్: సెర్ప్ బీర్‌పూర్ ఏపీఎం రజితను రాష్ట్ర సెర్ప్ కార్యాలయానికి సరెండర్ చేస్తూ కలెక్టర్ యాస్మిన్‌బాషా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. బీర్‌పూర్ మండలంలోని మహిళా సంఘాల్లో చోటు చేసుకున్న పరిణామాల్లో ఏపీఎం జిల్లా కార్యాలయంలోని సమాచారాన్ని బహిరంగపరుస్తూ సెర్ప్ హెచ్ఆర్ పాలసీకి విరుద్ధంగా వ్యవహరించారని పేర్కొన్నారు. దీంతో పాటు పలు అంశాలపై షోకాజ్ నోటీసులు జారీ చేసినా, వాటికి ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించే విధంగా సమాధానం ఇచ్చినట్లు గుర్తించారని వివరించారు. బీర్‌పూర్ ఏపీఎంగా సారంగాపూర్ ఏపీఎం రాజయ్యకు బాధ్యతలను అప్పగించి, రజితను హైదరాబాద్ సెర్ప్ కార్యాలయంలో కార్యనిర్వహణ అధికారి ఎదుట హాజరు కావాలని ఆదేశించారు.

### ఓపీఎస్‌తో ఉద్యోగులకు భరోసా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: ఉద్యోగ జీవితంలో సేవలందించిన వారి విశ్రాంత జీవితానికి పాత పెన్షన్ విధానం భరోసానిస్తుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్సీ నివాసం ఇందిరాభవన్‌లో పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానంతో ఉద్యోగుల పెన్షన్‌కు భద్రత లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో సీపీఎస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గంగాధరి మహేష్, ప్రధాన కార్యదర్శి సర్వ సతీశ్, కోశాధికారి గొల్లపల్లి మహేశ్‌గౌడ్, జిల్లా బాధ్యులు బోగ శ్రీనివాస్, జనార్దన్ పాల్గొన్నారు.

### వర్షానికి కూలిన ఇల్లు



సారంగాపూర్: బీర్‌పూర్ మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి సలికె గంగనర్సవ్వ నివసించే ఇల్లు కూలింది. కూలిన ఇంటిని తహసీల్దార్ శ్రీలత, రెవెన్యూ పరిశీలకుడు శ్రీనివాస్ పరిశీలించి తక్షణ సాయం కింద 20 కిలోల బియ్యం అందజేశారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందించేందుకు వివరాలను ఉన్నతాధికారులకు పంపినట్లు తహసీల్దార్ తెలిపారు.

### గోరింటాకు వేడుకలు



కథలాపూర్: మండల కేంద్రంలోని దుర్గామాత సన్నిధిలో శనివారం గోరింటాకు వేడుకలు నిర్వహించారు. మహిళలు గోరింటాకును చేతులపై పెట్టుకొని సందడి చేశారు.

# తాగునీరు సురక్షితమేనా..!

- పరిశుభ్రతకు నోచుకోని వాటర్ ట్యాంకులు
- కలుషితమవుతున్న నీరు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



ఇది కొత్తబస్టాండ్‌లోని పురాతనమైన వాటర్‌ట్యాంక్. పాకురుతో నిండిపోయింది. శుభ్రం చేశారో లేదో తెలియదు. మూడో నెలలో శుభ్రం చేసి నాల్గో నెలలో కడగాల్సి ఉందని తేదీలు వేశారు. అక్కడ చూస్తే ఎప్పుడో శుభ్రం చేసినట్లు తెలుస్తోంది. కలుషిత నీరు వస్తుందని ప్రజలు సైతం వాపోతున్నారు.



జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో గల వాటర్‌ట్యాంక్. దీనిని ఎప్పుడు శుభ్రం చేశారో కనీసం బోర్డులో సైతం రాయలేదు. అసలు శుభ్రం చేశారో లేదో తెలియదు. నిబంధనల ప్రకారం 15 రోజులకోసారి శుభ్రం చేసి బోర్డుపై తేదీలు రాయాలి. కానీ అవి కనిపించడం లేదు.

జగిత్యాల: వర్షాకాలం వాతావరణంలో మార్పులు ఏర్పడతాయి. సీజనల్ వ్యాధులకు మూలం. ముఖ్యంగా తాగునీరే. ఇది కలుషితమైతే మనుషులకు డయేరియా, వాంతులు తదితర అనేక రకాల రోగాలు వస్తుంటాయి. పట్టణాల్లో తాగునీరు అందించే ట్యాంకులు శుభ్రం చేయకపోవడంతో కలుషిత నీరు వస్తుందని ప్రజలు వాపోతున్నారు.

**పట్టించుకోని అధికారులు**

జిల్లా కేంద్రంలోని విద్యానగర్, కొత్తబస్టాండ్, తీన్‌ఖని వాటర్‌ట్యాంక్‌లకు ఫిల్టర్‌బెడ్ నుంచి మంచినీటి సరఫరా జరుగుతుంది. అక్కడి నుంచి కాలనీలకు మంచినీరు వెళ్తుంది. కానీ శుభ్రత విషయంలో మాత్రం అధికారులు పట్టించుకోవడం లేదు. ఫిల్టర్ బెడ్ వద్ద సైతం హలం వేయకుండానే నీటిని సరఫరా చేయడం, జలాశయం వద్ద శుభ్రం చేసే పరికరాలు సైతం శిథిలావస్థకు చేరుతున్నాయి. అయినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

**శుభ్రత ఎక్కడ?**

ప్రతీ ట్యాంక్‌ను ఖచ్చితంగా 15 రోజులకోసారి వాటర్‌ట్యాంక్‌ను పూర్తిగా శుభ్రం చేసి ప్రజలకు నీరందించాల్సి ఉంటుంది. దీంతో పాటు అక్కడ ఏరోజు శుభ్రం చేశాం, మళ్లీ ఏ రోజు చేయాలి అన్న బోర్డు సైతం తప్పకుండా ఏర్పాటు చేయాలి. కానీ జిల్లాలో ఎక్కడ కూడా అవి మచ్చుకు సైతం కనిపించడం లేదు. జగిత్యాల జిల్లాలో జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, ధర్మపురి, రాయికల్ ఐదు మున్సిపాలిటీలు ఉండగా, ఎక్కడ కూడా నిబంధనలు పాటించడం లేదు. దీంతో ప్రజలకు కలుషిత నీరే దిక్కవుతుంది.



విద్యానగర్‌లోని ట్యాంక్ వద్ద రాయని బోర్డు



కొత్తబస్టాండ్‌లో మూడో నెలలో కడిగినట్లు రాసిన బోర్డు

**లీకేజీలూ అధికమే**

ఒకవైపు ట్యాంక్‌లు శుభ్రంగా లేకపోవడంతో పాటు ఇటీవల మిషన్ భగీరథ పైప్‌లైన్‌లో భాగంగా అనేక చోట్ల మంచినీటి పైప్‌లైన్ పగిలిపోవడంతో నీరంతా కలుషితమవుతోంది. అధికారులు ట్యాంక్‌లు శుభ్రం చేయకపోవడం, అటు పైప్‌లైన్ లీకేజీలను అరికట్టకపోవడంతో ప్రజలకు అపరిశుభ్రమైన నీరే సరఫరా అవుతోంది. ప్రతి ఒక్కరూ మున్సిపల్ నీరే వాడుకుంటారు.

**రోగాలు అధికమే**

అన్ని మున్సిపాలిటీల్లో 90 శాతం మంది మంచినీటి సౌకర్యాన్ని వినియోగించుకుంటారు. కొందరు మాత్రమే మినరల్ వాటర్‌ను కొనుగోలు చేస్తుంటారు. పేదలు, మధ్యతరగతి వారు ఎక్కువగా మున్సిపల్ సరఫరా చేసే తాగునీటినే వాడుతుంటారు. అధికారులు మాత్రం ప్రతినెలా ముక్కుపిండి నల్లా బిల్లు వసూలు చేస్తున్నా సరఫరా చేసే నీటిలో మాత్రం నియమాలు పాటించరు. దీంతో అనేక మంది రోగాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రతీ 15రోజులకోసారి వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయడంతో పాటు లీకేజీలను అరికట్టాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

**శుభ్రత పాటిస్తున్నాం**

ప్రతీ 15 రోజులకోసారి ఖచ్చితంగా వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. దీంతో పాటు ప్రతీ ట్యాంక్ వద్ద బోర్డులను ఏర్పాటు చేసేలా చూస్తాం. లీకేజీలను అరికట్టేలా చర్యలు తీసుకుంటున్నాం.

– రాజేశ్వర్, మున్సిపల్ డీఈ

# పేదల ఆశాజ్యోతి వైఎస్సార్



వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న అడ్లూరి లక్ష్మణ్

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి/గొల్లపల్లి: ఇచ్చిన వాగ్దానాల అమలులో నిజాయితీగా, నిబద్ధతతో కృషి చేసిన పేద ప్రజల ఆశాజ్యోతిగా నిలిచిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సేవలు మరువలేనివని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురిలోని నంది కూడలి, గొల్లపల్లి మండలం గుంజపడుగు గ్రామాల్లో శనివారం కాంగ్రెస్ పార్టీ, వైఎస్సార్‌టీపీ, వైఎస్సార్ అభిమానుల ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా లక్షలాది మందికి కార్పొరేట్ వైద్య అందించిన ఘనత ఆయనకే దక్కిందని, రైతులకు ఉచిత విద్యుత్, విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్, రైతు రుణమాఫీ వంటి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని కొనియాడారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమాల్లో నాయకులు ఎస్.దినేష్, వేముల రాజేశ్, కుంట సుధాకర్, సింహరాజు ప్రసాద్, తాండ్ర సురేందర్, గజ్జెల స్వామి, వైఎస్సార్‌టీపీ రాష్ట్ర నాయకుడు ఎల్లంకి రమేష్, ధర్మపురి నియోజకవర్గ నాయకులు ప్రేమ్‌సాగర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిషాంత్‌రెడ్డి, ఎంపీటీసీ లంబ ధనవ్వ, లక్ష్మణ్, ఉప సర్పంచ్ కస్తూరి హరికిరణ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గాంధీ, దిలీప్, కనకయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయాలి



మాట్లాడుతున్న సదానందంగౌడ్

జగిత్యాల: బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ జూలైలోనే పూర్తి చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానందంగౌడ్ అన్నారు. శనివారం జగిత్యాలలోని ఎస్టీయూ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని, ఉపాధ్యాయులను వేర్వేరుగా చూస్తోందని, పాఠశాల విద్యారంగానికి ఉపాధ్యాయులు కీలకమని, అలాంటి ఉపాధ్యాయులు సమస్యలతో సతమతమైతే మంచి సమాజాన్ని ఎలా నిర్మిస్తారని అన్నారు. డీఈవో, డిప్యూటీ డీఈవో, ఎంఈవో, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయకుండా ఉత్తమ ఫలితాలు ఎలా సాధిస్తుందని ప్రశ్నించారు. ఎన్నికల కోడ్‌వచ్చేలోపు నూతన పీఆర్సీ, ఉద్యోగ ఉపాధ్యాయులకు ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పింఛన్ వర్తింపజేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పండిత, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని తెలిపారు. అనంతరం ఎస్టీయూ పూర్వ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మన్న అకాల మరణం పట్ల సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బైరం హరికిరణ్, మచ్చ శంకర్, రాజోజి భూమయ్య, కందుకూరి దయానంద్, శనిగరపు రజిని, కచ్చు రాజన్న, మేకల ప్రవీణ్, పోల్‌రెడ్డి, కిషన్, మురళీ పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్, బీజేపీ రహస్య ఒప్పందం

- సింగరేణి, మినరల్ ఫండ్స్‌పై విచారణ జరపాలి
- పార్టీ ఫండ్ ఇస్తే ప్రైవేట్ వర్సిటీలకు అనుమతులు
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్

జ్యోతినగర్(రామగుండం): రాష్ట్రంలో బీఆర్‌ఎస్, బీజేపీ మధ్య రహస్య ఒప్పందం ఉందని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ రామగుండంలోని టీవీ గార్డెన్స్‌లో రామగుండం నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రధాని మోదీ దేశంకోసం, ధర్మంకోసం అనడం మానుకుని ముందుగా బీజేపీ నాయకులకు సంస్కారం నేర్పించాలని సూచించారు. మధ్యప్రదేశ్‌లో ఆదివాసి వ్యక్తిపై మూత్రవిసర్జన చేసిన, కుల మతాల పేరుతో అసమానతలు సృష్టిస్తున్నందుకు ప్రధాని దేశానికి క్షమాపణలు చెప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వం యూనిఫాం సివిల్ కోడ్ తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. వెంటనే యూని ఫాం సివిల్ కోడ్ వెనక్కితీసుకోవాలని డిమాండ్ చేశా రు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలో సింగరేణి, జిల్లా మినరల్ ఫండ్స్ నిధుల గురించి విచారణ జరిపించా లని కోరారు. సింగరేణి నిధులకు.. గజ్వేల్ జిల్లాకు ఏం సంబంధమని, సీఎం కేసీఆర్ తన నియోజకవర్గానికి ఎందుకు నిధులు తరలించుకుపోతున్నారని ప్రశ్నించారు. పార్టీ ఫండ్ ఇచ్చిన వారి ప్రైవేట్ యూనివర్సిటీలకు అనుమతి ఇస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో పేదరికం, నిరుద్యోగం, దోపిడీ, కబ్జాలు, అనుమతి లేని వర్సిటీలు, కుంభకోణాలే కనిపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. తెలంగాణ వచ్చాకా ఆంధ్రప్రాంతం నాయకులకే కాంట్రాక్టులు దక్కుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి అవినీతిలో ఎమ్మెల్యేలందరికీ పాత్ర ఉందని, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో ఇసుక దందా విపరీతంగా సాగుతోందని వివరించారు. బీఎస్పీ నాయకుడు దేవునూరి సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన చిలుక రాంమూర్తి, ఎండీ.పాషాకు కండువాలు కప్పి ఆహ్వానించారు. బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి గోలివాడ ప్రసన్నకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధ్యక్షుడు కాసిపేట స్వామి, జిల్లా పధాన కార్యదర్శి రాజనర్సయ్య, పంజాబాల కల్యాణ్, జింక ఉదయ్, జనగామ మల్లేశ్, విజయగిరి రాము, సిరికొండ సది, కాసర్ల పోశమల్లు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు



గాయపడ్డ రంజిత్, సురేశ్, మధు

సారంగాపూర్: మండలంలోని పెంబట్ల గ్రామశివారుల్లో శనివారం రాత్రి తొమ్మిదిన్నర గంటల ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రేచపల్లికి చెందిన బోదనపు రంజిత్ జగిత్యాల నుంచి ద్విచక్రవాహనంపై రేచపల్లికి వస్తున్నాడు. ఆ సమయంలో రేచపల్లికి చెందిన అన్నవేని సురేశ్, బండి మధులు మరో ద్విచక్రవాహనంపై జగిత్యాల వెళ్తున్నారు. ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో రంజిత్, సురేశ్‌ల పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు. వీరిని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

### శివసాయి లాడ్జిలో అగ్నిప్రమాదం

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో గల శివసాయి లాడ్జిలో శనివారం రాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. లాడ్జిలోని విద్యుత్ మీటర్ల వద్ద షార్ట్‌సర్క్యూట్ జరగడంతో మంటలు చెలరేగి గదుల్లోకి వ్యాపించాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలు ఆర్పేశారు. రూ.3లక్షల నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు.

### రహదారిపై పడిన గ్రానైట్ రాళ్లు

- తప్పిన ప్రమాదం



కొండగట్టు: కరీంనగర్–జగిత్యాల హైవేపై ఘోర ప్రమాదం తప్పింది. శనివారం కొడిమ్యాల మండలం పూడూర్ గ్రామ శివారులో గ్రానైట్ రాళ్లను తీసుకెళ్తున్న లారీ ఓవర్‌లోడ్‌తో ట్రాలీ నుంచి విడిపోయింది. ట్రాలీలో ఉన్న పెద్ద గ్రానైట్ రాళ్లు రోడ్డుపై పడ్డాయి. ఆ సమయంలో ట్రాఫిక్ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఓవర్‌లోడ్‌తో వెళ్లడం వల్లనే ఘటన జరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు.

### ట్రాక్టర్ చోరీ

కథలాపూర్: మండల కేంద్రంలోని దండవేని మల్లేశ్‌యాదవ్‌కు చెందిన ట్రాక్టర్‌ను శనివారం చోరీకి గురైనట్లు గ్రామస్తులు తెలిపారు. మల్లేశ్‌యాదవ్ తన ఇంటి సమీపంలో పార్కింగ్ చేసిన సుమారు రూ.6లక్షల విలువైన ట్రాక్టర్, ట్రాలీని దొంగలు ఎత్తుకెళ్లారన్నారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు మల్లేశ్‌యాదవ్ తెలిపారు.

### తాతపై మనవడి దాడి

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామంలో తాతపై మనవడు దాడి చేయడంతో తాత తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్టేషన్ హౌజ్ ఆఫీసర్ చందులాల్ తెలిపిన వివరాల ప్రకారం.. తుంగూర్‌కు చెందిన పొకల్కర్ బాబుకు నలుగురు కుమారులు. ఇద్దరు విదేశాల్లో ఉంటుండగా ఇద్దరు తుంగూర్‌లో ఉంటున్నారు. కుటుంబంలో తరచూ గొడవలు జరుగుతున్నాయి. పొకల్కర్ చిన్న కుమారుడు వద్ద ఉంటున్నాడు. ఇది గిట్టని పెద్ద కుమారుడు కొడుకు సంతోశ్ తాత తనపై ఉమ్మాడని పేర్కొంటూ దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈమేరకు సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

### పాతపింఛన్ సాధన సంకల్పయాత్రకు మద్దతు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీఆర్టీయూ నాయకులు

జగిత్యాల: జోగులాంబ గద్వాల్ జిల్లా నుంచి 16న టీఎస్‌సీపీఎస్‌ఈయూ సంఘం నిర్వహించనున్న పాత పింఛన్ సాధన సంకల్పయాత్రకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, బోయినిపల్లి ఆనందరావు అన్నారు. శనివారం జగిత్యాలలోని ఓల్డ్ హైస్కూల్‌లో సంకల్పయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈనెల 12న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమానికి కూడా పీఆర్‌టీయూ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌సీపీఎస్‌యూ అధ్యక్షుడు గంగధరి మహేశ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, గోవర్ధన్, రాజు, రత్నాకర్ పాల్గొన్నారు.

**టీపీటీఎఫ్ నాయకుల మద్దతు**

సీపీఎస్ రద్దు కోరుతూ టీఎస్‌సీపీఎస్‌యూ తలపెట్టిన సంకల్పయాత్రకు టీపీటీఎఫ్ నాయకులు మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంకల్పయాత్రలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గొడుగు రఘుపతియాదవ్, గోవర్ధన్ పాల్గొన్నారు.

# రైతుబీమా సౌకర్యం కల్పించాలి



మాట్లాడుతున్న గల్ఫ్ జేఏసీ చైర్మన్ రవిగౌడ్

కథలాపూర్(వేములవాడ): గల్ఫ్‌లో ఉన్న వారికి రైతు బీమా సౌకర్యం కల్పించాలని గల్ఫ్ జేఏసీ చైర్మన్ గుగ్గిల్ల రవిగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మేడిపెల్లి మండలం కాచారాం గ్రామంలో గల్ఫ్ కార్మికులకు రైతుబంధు, రైతు బీమా పథకంపై అవగాహన కల్పించారు. గల్ఫ్ నుంచి ఇటీవల స్వగ్రామాలకు వచ్చిన వారు రైతుబీమా పథకంకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 10 నుంచి ఆగస్టు 5 వరకు రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. రేషన్ కార్డుల్లో పేర్లు లేని గల్ఫ్ కార్మికులు నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఒడ్డవేని లక్ష్మణ్, బడుగు జలంధర్, మల్యాల స్వామి, చెప్యాల లింగం, రాజేందర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఏసియా యూనివర్సిటీకి ధర్మపురి వాసి ఎంపిక



తల్లిదండ్రులతో స్వప్నిక

ధర్మపురి: జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన విరంచి స్వప్నిక ఏసియా యూనివర్సిటీకి ఎంపికైంది. రంగు వెంకటరమణ, శ్రీలతల రెండో కూతురైన స్వప్నిక మండలంలోని మగ్గిడి మోడల్ స్కూల్‌లో ఇంటర్ పూర్తి చేసి ఇటీవల కరీంనగర్‌లో డిగ్రీ పూర్తి చేసింది. చదువుతోపాటు పవర్ లిఫ్టింగ్‌లో ఆసక్తి పెంచుకుంది. తల్లిదండ్రులు, కోచ్ సహకారంతో అంచెలంచెలుగా జిల్లాస్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ, సౌత్ ఇండియా స్థాయి వరకు చేరింది. జూన్ 6 నుంచి 11వ తేదీ జార్ఖండ్‌లోని రాంచీలో నిర్వహించిన జూనియర్ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో చాంపియన్‌షిప్‌తో సిల్వర్‌మెడల్ సాధించి ఏకంగా ఏసియా యూనివర్సిటీకి ఎంపికై రాష్ట్రంలోనే రెండో క్రీడాకారిణిగా నిలిచింది.

**దుబాయ్‌లో జరిగే పోటీలకు ఎంపిక**

ఏసియా యూనివర్సిటీకి ఎంపికై న స్వప్నిక దుబాయ్‌లో ఆగస్టు 16 నుంచి 21వరకు జరిగే జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికై ంది. క్రీడారంగంలో అంచెలంచెలుగా ఎదుగుతూ ఇప్పటి వరకు మొత్తం 23 పతకాలు సాధించింది. ఇందులో 12 బంగారు, సిల్వర్ పతకాలు, 3 రజత పతకాలు సాధించింది. ఏసియా యూనివర్సిటీకి వెళ్లేందుకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరుతున్నారు.

# రైల్వేగేట్ పడకపోయి ఉంటే..!

- కూతురును చూసేందుకొచ్చిన తండ్రికి గుండెపోటు
- కరీంనగర్ తరలిస్తుండగా పడిన రైల్వేగేట్
- సకాలంలో చికిత్స అందక మృతి
- కన్నీరుమున్నీరైన కూతురు, కుటుంబసభ్యులు

ధర్మారం/వెల్గటూర్ : కూతురు గురుకులం విద్యాలయంలో పదోతరగతి చదువుతోంది. రెండో శనివారం కావడంతో విద్యాలయంలో పేరెంట్స్‌డే నిర్వహించారు. ఎంతో అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురును చూసేందుకు ఆ తండ్రి విద్యాలయానికి వచ్చాడు. ఇంటినుంచి తీసుకెళ్లిన ప్రత్యేకమైన వంటకాలు కూతురుకు తినిపించాడు. అంతలోనే విధి వక్రీకరించిందేమో.. ఆ తండ్రి గుండెపోటుతో అల్లాడిపోయాడు. వెంటనే పాఠశాల సిబ్బంది అతడిని కరీంనగర్ తరలించారు. అక్కడ మరోసారి విధి అతడిని చిన్నచూపు చూసింది.. అప్పుడే కరీంనగర్ వద్దగల రైల్వేగేట్ పడింది. సుమారు 15 నిమిషాలు ఆలస్యమైంది. ఆసుపత్రిలో చేర్చగా.. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ప్రకటించారు. సంఘటనకు సంబంధించిన వివరాలు.. మండలంలోని మల్లాపూర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకులం విద్యాలయంలో



విజయ్(ఫైల్)

జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం స్తంభంపల్లి గ్రామానికి చెందిన భూపెల్లి విజయ్, సుధీవన కూతురు స్పందన పదో తరగతి చదువుతోంది. రెండో శనివారం కావడంతో విద్యాలయంలో పేరెంట్స్ డే నిర్వహించారు. దీంతో విజయ్, సుధీవన దంపతులు ఉదయమే కూతురు కోసం ప్రత్యేకమైన వంటకాలు తయారు చేసుకుని విద్యాలయానికి చేరుకున్నారు. మధ్యాహ్నం కూతురుతో కలిసి భోజనం చేశారు. అదే సమయంలో వర్షం రావడంతో ప్రిన్సిపాల్ గిరిజ తల్లిదండ్రులందరినీ హాల్‌లోకి రావాలని సూచించారు. హాల్‌లోకి వచ్చి విజయ్ కూర్చుంటున్న క్రమంలోనే కుప్పకూలిపోయాడు. గమనించిన ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్ సుంచు మల్లేశం, విజయ్ భార్య సుధీవన చికిత్స కోసం అంబులెన్స్‌లో కరీంనగర్‌కు తరలించారు. కరీంనగర్ వద్ద ఉన్న రైల్వేగేట్ అప్పుడే పడటంతో సుమారు 15 నిమిషాలపాటు విజయ్ అంబులెన్స్‌లోనే కొట్టుమిట్టాడాడు. తీరా ఆసుపత్రిలో చేర్చ.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కరీంనగర్‌లో గేట్ పడకుంటే విజయ్ బతికేవాడని మల్లేశం తెలిపారు. మృతదేహం వద్ద కూతురు స్పందన రోదించిన తీరు కలచివేసింది. కుటుంబసభ్యులు, రోదనలతో స్తంభంపల్లిలో విషాదం నెలకొంది.